
సాక్షి ఒడిశా

ఆదివారం । 7 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.6,62,889
బంగారం 14 గ్రాములు
వెండి 1 గ్రాము 500 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



కృషి రథం ప్రారంభం

- 8లో



క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

- 8లో

న్యూస్‌రీల్

76 అధునాతన స్కూల్స్ ప్రారంభం

- వర్చువల్ విధానంలో ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్



వేదిక మీద ఆశీనులైన కలెక్టర్ కమలోచన్ తదితరులు



మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

కొరాపుట్: రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతులతో 5టీ విభాగం నిర్మించిన 76 స్కూళ్లను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం రాత్రి ప్రారంభించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఈశ్వర్ మందిర్ రోడ్డులో 5టీ స్కూల్‌గా రూపాంతరం చెందిన పాఠశాల ఆవరణలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీలు ప్రసంగించారు. 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ విద్యార్థులతో సంభాషించారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానీ, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సుమంతి మహంతి

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ పోలీసుస్టేషన్ ఐఐసీగా సుమంతి మహంతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఆమె రాయగడ పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ముకుంద దేవ్ నాయక్ పద్మపూర్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు.

బలహీన వర్గాలతో ముఖాముఖి



గిరిజనులతో మాట్లాడుతున్న రాష్ట్రపతి ముర్ము

భువనేశ్వర్: రాష్ట్రంలో బలహీన వర్గాల బాగోగులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. 3 రోజుల రాష్ట్ర పర్యటన ముగిసే ముందు ఆమె ఆయా వర్గాలతో ముఖాముఖిగా చర్చించారు. మయూర్‌భంజ్ జిల్లా బరిపద మహారాజా శ్రీరామచంద్ర భంజ్‌దేవ్ విశ్వ విద్యాలయం ఆవరణలో ఒడిశాలోని ప్రత్యేక బలహీన గిరిజన సమూహాలతో (పీవీటీజీ) శనివారం సంభాషించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ సైతం పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు





కొండమాల్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన బల్లిగుడా అమ్మవారి సంబరాలు శనివారంలో వైభవంగా ముగిశాయి. గ్రామ దేవత మాకుటారి అమ్మవారి సంబరాలు చివరి రోజు కావడంతో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

- బరంపురం

విద్యాభ్యాసం నిరంతర ప్రక్రియ

- విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: మనిషి జీవితంలో విద్యాభ్యాసం నిరంతర ప్రక్రియ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మయూర్‌భంజ్ జిల్లా బరిపద మహారాజా శ్రీరామ చంద్ర భంజాదేవ్ (ఎంఎస్‌సీబీ) విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవంలో శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్సిటీ ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే ఉన్నత విద్య, పరిశోధన రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించడం అభినందనీయమన్నారు. గిరిజన సాంప్రదాయాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడే లక్ష్యంతో విశ్వ విద్యాలయం తన క్యాంపస్‌లో 'సేక్రేడ్ గ్రోవ్' స్థాపించడంపై ప్రశంసించారు. పర్యావరణం, స్థానిక జీవ వైవిధ్య పరిరక్షణకు 'సేక్రేడ్ గ్రోవ్' ముఖ్యమని పేర్కొన్నారు. సహజ వనరులపై కమ్యూనిటీ-ఆధారిత నిర్వహణకు ఇది ఉత్తమ ఉదాహరణగా నిలుస్తుందన్నారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల వల్ల ప్రపంచం భారీ సవాళ్లను ఎదుర్కొంటోందని తెలియజేశారు. ప్రకృతి అనుకూలమైన జీవన శైలిని అవలంభించడానికి చెట్లను పెంచాలని సూచించారు. ప్రకృతితో మమేకమై జీవించడం మానవులందరి కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సిమిలిపాల్ నేషనల్ పార్క్ జీవ వైవిధ్యపరంగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకత కలిగి ఉందని తెలియజేశారు.

ఉద్యోగం ఇవ్వాలనే ఆలోచన గొప్పది

గ్రాడ్యుయేట్ విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన తర్వాత కొందరు ఉద్యోగం చేస్తారని, మరికొందరు వ్యాపారం చేస్తారని, మరికొందరు పరిశోధనలు చేస్తారని అన్నారు. అయితే ఉద్యోగం చేయాలనే ఆలోచన కంటే ఉద్యోగం ఇవ్వాలనే ఆలోచనే మంచిదని తెలియజేశారు. యూనివర్సిటీ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి స్టార్టప్‌ల ఏర్పాటులో విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, సామాన్యులకు సహకారం అందిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పోటీతత్వం అవసరమన్నారు. పోటీలో విజయం సాధించేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలని, అందుకోసం ఉన్నత నైపుణ్యాలను అలవర్చుకుంటూ మరింత సమర్థత దిశగా పయనించాలని సూచించారు. చదువుల్లో పోటీ పడుతూనే సాటివారికి సాయం చేసే స్వభావం ఏర్పరుచుకోవాలన్నారు. సమాజ శ్రేయస్సు, దేశ సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న దృశ్యం



వర్సిటీ ప్రాంగణంలో శ్రీరామచంద్ర భంజ్‌దేవ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ష్...!

- రాష్ట్రపతి ముర్ము ప్రసంగానికి విద్యుత్ అంతరాయం
- చీకటిలోనే కొనసాగిన ప్రసంగం
- అంధకారంలో భద్రతా వ్యవస్థ
- సర్వత్రా ఆందోళనకరం



అంధకారంలోనే ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా బరిపద మహారాజా శ్రీరామచంద్ర భంజాదేవ్ (ఎంఎస్‌సీబీ) విశ్వవిద్యాలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కార్యక్రమంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో భద్రతా వ్యవస్థ అంధకారంలోకి వెళ్లి తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్సిటీ ప్రాంగణంలో రాష్ట్రపతి తన ప్రసంగాన్ని చీకటిలో కొనసాగించాల్సి వచ్చింది. ఉదయం 11.56 గంటల నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు ఆకస్మాత్తుగా తొమ్మిది నిమిషాలు పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో భద్రత గార్డులు, సహాయక సిబ్బంది ఒకరికొకరు కానరాని పరిస్థితులు తాండవించాయి. ఇటువంటి పరిస్థితుల్లోనే పోడియంపై మసకబారిన మిణుగురు కాంతితో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం నిరవధికంగా కొనసాగించారు. అనంతరం ఈ పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయం అందం చీకటిమయం అని సుతిమెత్తగా వ్యాఖ్యానించారు.

ఘటనపై విచారణ

ఘటనపై యూనివర్సిటీ వీసీ సంతోష్ త్రిపాఠి విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముందే జనరేటర్‌ను మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. సకాలంలో ఎందుకు పని చేయలేదో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయంపై విచారణ చేపడతామని తెలియజేశారు. ఇడ్కో ఈ భవనాన్ని నిర్మించింది. జనరేటర్‌కు మరమ్మతులు కూడా చేసింది. ప్రత్యేక జనరేటర్ ఉన్నప్పటికీ అది పనిచేయలేదన్నారు. ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ప్రాథమిక చర్యగా ఈ సంస్థ ఎలక్ట్రికల్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. టాటా పవర్‌కు చెందిన హరీష్ కుమార్ పండా మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముందు విద్యుత్ కనెక్షన్‌లను తనిఖీ చేశామన్నారు. అన్నీ సక్రమంగా పనిచేస్తుండేవని పేర్కొన్నారు. అలాగే బ్యాకప్‌గా అక్కడ ఒక జనరేటర్ సెట్ అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. టాటా పవర్ నార్తర్న్ ఒడిషా డిస్ట్రిక్ట్ లిమిటెడ్ (టీపీఎన్‌ఓడీఎల్) సీఈవో భాస్కర్ సర్కార్ మాట్లాడుతూ డీజీ సెట్లు నడుస్తున్నాయని, ఏసీలు, మైక్రోఫోన్ పని చేస్తున్నాయని, అయితే భవనం అంతర్గత వైరింగ్ లోపం కారణంగా లైట్లు ఆరిపోయాయని నివేదించారు.

విచారణకు ఆదేశం

ఇదిలా ఉండగా రాష్ట్రపతి ప్రసంగం సందర్భంగా జరిగిన విద్యుత్ వైఫల్యంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. యూనివర్సిటీ కూడా సమాంతర విచారణ ప్రారంభించింది. పీజీ కౌన్సిల్ చైర్మన్ పి.కె.శతపతి, రిజిస్ట్రార్ సహదేవ్ సమాధియా, డవలప్‌మెంట్ ఆఫీసర్ బసంత్ మొహంతాతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం లోపాన్ని విచారణ చేపట్టనుంది. విచారణలో దోషులుగా తేలిన వారిపై చర్యలు తీసుకుంటామని సెంట్రల్ రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్‌డీసీ) సురేష్ దలాసి తెలిపారు. అదేవిధంగా విద్యుత్ అంతరాయం వెనుక కారణాలను తెలుసుకోవడానికి సమగ్ర విచారణ జరుపుతామని బరిపద అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఏడీఎం) రుద్ర నారాయణ్ మహంతి తెలిపారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతిక లోపం వల్లే ఈ ఘటన జరిగినట్లు తెలిపిన అనంతరం రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (ఆర్‌డీసీ) అత్యవసర సమావేశం నిర్వహించారు.

గిరిజన విద్యార్థిని మృతి



కుమార్తె మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఉదయం నాలుగు నెలల గర్భంతో ఉన్న మైనర్ గిరిజన బాలిక మృతి చెందింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ లక్ష్మీపూర్ పంచాయతీ సన్నసోడా గ్రామానికి చెందిన కవితా శబర (15) అనే బాలిక జిర్‌జిరా ప్రభుత్వ కన్యాశ్రమం (రెసిడెన్సియల్ పాఠశాల)లో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఏప్రిల్ 10వ తేదీన వార్షిక పరీక్షలు పూర్తవ్వడంతో గ్రామానికి వచ్చింది. అయితే గ్రామానికి వచ్చిన వారం రోజులకే విద్యార్థిని కవితా శబర అస్వస్థతకు గురవ్వడంతో గ్రామస్తులు పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. డాక్టర్లు పరీక్షలు చేసి ఆమె నాలుగు నెలల గర్భావస్థలో ఉందని కుటుంబ సభ్యులకు తెలిపారు. అయితే కారణం తెలియకుండానే శనివారం వేకువజామున విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. దీనిపై రామగిరి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి ఆనందపాత్రో కేసు నమోదు చేశారు. లక్ష్మీపూర్ పంచాయతీ జిర్ జిరా కన్యాశ్రమంలో మైనర్ బాలిక గర్భం దాల్చడంపై పాఠశాలలో సూపరింటెండెంట్, వార్డెన్ బాధ్యాతారహితంగా వ్యవహరించడమే కారణమని తల్లిదండ్రులు, గ్రామస్తులు విమర్శిస్తున్నారు. బాలిక మృతిపై విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్టీసీ చైర్మన్ మరియం రైతో ఆదేశించారు. దీనిపై జిల్లా సంక్షేమ శాఖ అధికారి సంతోష్ కుమార్ రోథోను ప్రశ్నించగా, బాలిక మరణంపై వివరాలు తెలియవని, ఆదివారం పాఠశాలకు వెళ్లి విచారించనున్నట్లు పేర్కొన్నారు.

డొంగిరియాలో ఒపిలిపి అధికారుల పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న అధికారుల బృందం సభ్యులు



డొంగిరియా ప్రాంతాల్లో బృందం అధికారులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి చాటికొన పంచాయతీ పరిధి కుర్లి, ఖజురి, ఖాంబేసు, చంచలగుడ, కద్రగుమ్మ తదితర గ్రామాల్లో ఒపిలిపి (ఒడిశా ఎంపవర్‌మెంట్ అండ్ లైవ్లీ హుడ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) సంస్థకు చెందిన అధికారుల బృందం శుక్రవారం పర్యటించింది. సంస్థకు చెందిన అక్షయ పాతి, అంకుర్ అభిలాష్, సిద్దేశ్వర్ నాయక్, కౌషిక్ పట్నాయక్, దేవదత్త ప్రధాన్‌లు నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదిమ తెగకు చెందిన డొంగిరియా ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను సమీక్షించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బృందం సభ్యులు రాష్ట్ర రాజధానికి తిరుగు పయనమయ్యారు.

బాక్సింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణలో విద్యార్థులు



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సంఘమిత్ర దొళాయి

బరంపురం: స్థానిక బరంపురం క్రీడా మైదానంలో గంజాం బాక్సింగ్ క్రీడా సంఘం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ బాక్సింగ్ శిక్షణ శిబిరం శనివారం ప్రారంభమైంది. బీఎంసీ నగర మేయర్ సంఘమిత్ర దొళాయి శిబిరం ప్రారంభించారు. నెల రోజుల పాటు జరగనున్న శిక్షణలో గంజాం జిల్లాకి చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 50 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా క్రీడా సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ సాహు తెలియజేశారు.

వివాహం నిమిత్తం ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

జయపురం: ఒక నిరుపేద అమ్మాయి వివాహం నిమిత్తం జయపురం చిరంజీవి కల్చరల్ అసోషియేషన్ సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక మహాత్మాగాంధీ రోడ్డులో ఉన్న చిరంజీవి కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తల్లిదండ్రులకు రూ.42,200 నగదు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.శ్రీనివాస ఖన్నా మాట్లాడుతూ.. తమ అసోసియేషన్ జయపురంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలియజేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జయపురం అధ్యక్షుడు ఎం.ఎం.నగేష్, కార్యదర్శి గోవింద నాయిక్, ఉపాధ్యక్షుడు కె.గణేష్ రెడ్డి, కె.రాంబాబు, సహాయ కార్యదర్శులు సుదర్శన రావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఈ-కోర్టులతో ప్రజలకు చేరువగా సేవలు

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్

భువనేశ్వర్: ఈ-కోర్టులతో న్యాయస్థానాల సేవలు సాధారణ పౌరులకు చేరువవుతాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. ఒడిశా హైకోర్టు నిర్వహించిన డిజిటలైజేషన్, పేపర్ లెస్ కోర్టులు, ఈ-ఇనీషియేటివ్‌లపై జాతీయ సదస్సులో శనివారం ప్రసంగించారు. రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎస్.మురళీధర్ ప్రారంభోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్ ఈ సదస్సులో ప్రసంగించారు. ఈ సందర్భంగా జస్టిస్ డి.వై.చంద్రచూడ్ మాట్లాడుతూ.. ఒడిశా హైకోర్టు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో వర్చువల్ కోర్టులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 2023-27 మధ్య కాలంలో ఈ-కోర్టుల 3వ దశ విస్తరణ పూర్తి అవుతుందని పేర్కొన్నారు. అయితే న్యాయస్థానాల్లో చోటుచేసుకునే పలు సన్నివేశాలు, సందర్భాలు యూట్యూబ్‌లో ప్రసారం అవుతుండడాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

తీర్పుల అనువాదం ప్రారంభం

దేశంలో ఈ-తీర్పుల అనువాద వ్యవస్థ ప్రారంభమైందని తెలియజేశారు. దీనిలో భాగంగా సుప్రీం కోర్టు తీర్పులను అనువదిస్తారని వెల్లడించారు. ఈ-ఎస్‌సీఆర్ ద్వారా తీర్పులన్నీ డిజిటలైజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2016 సంవత్సరం నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలియజేశారు. దేశవ్యాప్తంగా పౌరులకు అర్థమయ్యే భాషలో న్యాయస్థానాల తీర్పులను అందుబాటులోకి తీసుకురావడమే దీని ఉద్దేశమని వెల్లడించారు. దేశంలో కేవలం రికార్డుల పరిశీలన, పర్యవేక్షణ వగైరా కార్యకలాపాలతో దాదాపు 8% కేసుల విచారణ ఆలస్యం అవుతోందన్నారు. ఈ సమస్యని అధిగమించడంలో డిజిటలైజేషన్ సహాయపడుతుందని పేర్కొన్నారు.

బ్యాంకుల సేవలు ప్రశంసనీయం

- కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్



బ్యాంకు మేనేజర్లను అభినందిస్తున్న కలెక్టర్ సింగ్

రాయగడ:

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో బ్యాంకులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాంతీయ పరిశ్రమల కేంద్రం శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువతకు తగు సమయంలో బ్యాంకులు రుణాలు మంజూరు చేయడంతో ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయని పేర్కొన్నారు. స్థానిక యూనియన్ బ్యాంకు రుణాలు మంజూరు చేయడంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, అదేవిధంగా సెంట్రల్ బ్యాంకు ద్వితీయ, రామనగుడలో ఉన్న ఎస్‌బీఐ తృతీయ స్థానాల్లో నిలించిందని వెల్లడించారు. అనంతరం ఆయా బ్యాంకుల మేనేజర్లను అభినందించడంతో పాటు ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఐపీవో సవ్యసాచి సాహు, బ్యాంకు అధికారులు, జిల్లా సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెలవుల్లో క్లాసులకు రమ్మంటున్నారు!

● డయల్ యువర్ వర్సిటీలో విద్యార్థుల ఫిర్యాదు



ఫోన్ ఇన్ లైవ్ నిర్వహిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ఇన్ లైవ్ కార్యక్రమం నిర్వహి ంచారు. 15 ఫోన్ కాల్స్ రాగా దాదాపుగా పరీక్షలు ఫలితాలు, నిర్వహణపైనే విద్యార్థులు ప్రశ్నలు వేశారు. పొందూరు, శ్రీకాకుళం, పలాస ప్రాంతాల నుంచి ఇయర్ ఎండ్ విధానంలో డిగ్రీ చదివిన విద్యార్థులు స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని, డిగ్రీ ఉత్తీర్ణత బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల వల్ల సాధ్యం కాలేదని చెప్పారు. అధికారులు స్పందిస్తూ ప్రస్తుతం సెమిస్టర్ విధానంలో పరీక్షలు జరుగుతున్నాయని, ఇయర్ ఎండ్ విద్యార్థుల కోసం మూడేళ్లకు ఒకసారి స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం కాకినాడ అదిత్య నుంచి కొందరు విద్యార్థులు ఫోన్ చేస్తూ వర్సిటీ అనుబంధ కళాశాలలకు ఈ నెల 8 నుంచి 31 వరకు సెలవులు ప్రకటించారని, తమ కళాశాలలో తరగతులకు రమ్మంటున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతామని అధికారులు చెప్పారు. రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాల కోసం విద్యార్థి ప్రశ్నించగా పది రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు. ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ కోసం ప్రశించగా, జూన్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డిగ్రీ రెండో సెమిస్టర్ 10 రోజుల్లో, మొదటి సెమిస్టర్ ఫలితాలు ఈ నెల చివర్లో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, ప్రొఫెసర్ పీలా సుజాత, డాక్టర్ ఎం.అనూరాధ పాల్గొన్నారు.


8 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని లైబ్రరీల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, కార్యదర్శి(ఎఫ్ఏసీ) వి.వి.జి.ఎస్.శంకరరావు అధ్యక్షతన శాఖా గ్రంథాలయాధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు నిర్వహించి పిల్లల్లో సృజనాత్మకత వెలికితీయాలన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సువ్వారి సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూర్మనాథాలయంలో పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

గార: శ్రీకూర్మనాథుని కల్యాణ ముగింపు ప్రక్రియలో భాగంగా శనివారం సాయంత్రం అనివెట్టి మంటపంలో స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పుష్పయాగం నిర్వహించారు. పలు రకాల ఆహార పదార్థాలను నివేదించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుమారుడిని రక్షించేందుకు వెళ్లి..

● విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



సుందరమ్మ(ఫైల్)

బూర్జ: మండలంలోని అన్నంపేటకు చెందిన అంపోలు సుందరమ్మ (42) శనివారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందరమ్మ కుమారుడు సతీష్ ఎలక్ట్రికల్ బోర్డు ప్లగ్‌లో ఫ్యాన్ వైరు పెడుతుండగా పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. తల్లి సుందరమ్మ గమనించి కుమారుడు ప్రాణం రక్షించేందుకు అబ్బాయిని పక్కకి తోసి ఫ్యాన్ వైరు పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సతీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో అన్నంపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతురాలికి భర్త రాజులు, కుమారుడు సతీష్ ఉన్నాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న ఎస్పీ నితీష్ వాద్వానీ

మల్కన్‌గిరి: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎస్పీ నితీష్ వాద్వానీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధన్‌గూఢ గ్రామం వద్దనున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో సత్తాచాటుతూ ఉండడం గర్వకారణమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞాన్ రంజాన్ దాస్ మాట్లాడుతూ.. ఇక్కడ విద్యనభ్యసించిన గిరిజన యువతి దుబాయి వెళ్లనుందని తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేశ్వర్ చంద్ర నాయిక్, క్రీడా విభాగం అధ్యాపకురాలు బవితా మహంతి, జోష్నాక్విన్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కృషి రథం ప్రారంభం



కృషి రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బరంపురం: గంజాం జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఖరీఫ్ పంటల కోసం కృషి రథాన్ని శనివారం ప్రారంభించారు. జిల్లా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దివ్య జ్యోతి పరిధా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ రథం ఖరీఫ్ సాగుకు రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలపై ప్రచారం చేయడమే కాకుండా, రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఎం లీనాచంద్ కేశవం తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి దృష్టికి జిల్లా కోర్టు సమస్యలు



జస్టిస్ భానుమతిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్.భానుమతిని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా, డీఎల్ఎస్ కార్యదర్శి సన్యాసినాయుడు కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ జిల్లా కోర్టు ఆవరణలో బ్యాంకును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆమె సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. వీటితో కోర్టులో పలు సమస్యలను కూడా ఆమెకు వివరించారు. అనంతరం న్యాయమూర్తి భానుమతి మాట్లాడుతూ కోర్టులో జూనియర్ న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. స్టేట్ బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి నీలంశెట్టి చిన్నారావు, ట్రెజరర్ ఎల్.నారాయణ, గ్రంథాలయ కార్యదర్శి ఎం.భవానీ ప్రసాద్, స్పోర్ట్సు కార్యదర్శి జి.భాస్కరరావు, మహిళా ప్రతినిధి వి.హరిప్రియ, సీనియర్ న్యాయవాదులు పాడి సీతంనాయుడు, వాన కృష్ణచంద్, మామిడి క్రాంతి, టి.ఖగేంద్ర, ఎస్.వెంకటరావు, శిష్టు రమేష్, బి.ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ భానుమతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్.భానుమతిని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శనివారం ఆర్అండ్‌బీ వసతి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయాధికారులకు జరిగే పీరియాడికల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆమెకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు

సజావుగా సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి:

స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి రెవెన్యూ సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా రెవెన్యూ విభాగంలో పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లు, పట్టాల పంపిణీ, అటవీ ప్రాంత భూముల సర్వేపై చర్చించారు. సమావేశంలో ఏడీఎం బీరేంద్ర కుమార్ దాస్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్షిపాత్రో సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సుధీర్ దాస్

రాయగడ: మున్సిపల్ మాజీ చైర్మన్ దివంగత కృష్ణచంద్ర భక్షిపాత్రో రాయగడ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. స్థానిక కృష్ణచంద్ర నగర్ భవనంలో కృష్ణచంద్ర భక్షిపాత్రో స్మృతి కమిటీ ఆధ్వర్యంలో భక్షిపాత్రో జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయగడలో కొత్త బస్టాండ్ నిర్మాణం భక్షిపాత్రో కృషి ఫలితమేనని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుదీర్ దాస్, రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, ద్వితీచంద్ర సాహు, గోపీనాథ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచే డిగ్రీ రీసెర్చ్, హానర్స్ కోర్సులు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ బిడ్డిక అడ్డయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ఏడాది నుంచి డిగ్రీ రీసెర్చ్, హానర్స్ డిగ్రీ కోర్సులు ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. విశ్వవిద్యాలయంలో శనివారం డీన్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్యతో కలిసి కోర్సుల నిర్వహణ మార్గదర్శకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020–21లో డిగ్రీ ప్రవేశాలు పొందిన విద్యార్థులు చివరి ఏడాదికి చేరుకున్నారని తెలిపారు. జూన్‌లో ఆరో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించి, జూలైలో ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు హానర్స్, రీసెర్చ్ డిగ్రీ మరో ఏడాది చదివేందుకు అర్హులని పేర్కొన్నారు. హానర్స్‌కు ఉత్తీర్ణత సరిపోతుందని, రీసెర్చ్ కోర్సుకు డిగ్రీ మూడేళ్ల కోర్సు ఆరు సెమిస్టర్లలో గ్రూపు సబ్జెక్టుల్లో 75 శాతం మార్కులు ఉండాలని స్పష్టం చేశారు. అన్ని డిగ్రీ కళాశాలలకు ఈ కోర్సులు నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. మూడేళ్లలో కనీసం 30 శాతం దాటి డిగ్రీ ప్రవేశాలు జరగాలని చెప్పారు. నాలుగేళ్లు డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఒక ఏడాది పీజీ చదివితే సరిపోతుందన్నారు. డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు నాలుగో ఏడాది కోసం వర్సిటీకి దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన కళాశాలల్లో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో సైతం నాలుగో ఏడాది డిగ్రీ రీసెర్చ్, హానర్స్ నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సులో ఏడు, ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయని తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి వంటి సంస్థలు నిర్వహించే ఆన్‌లైన్ కోర్సులు చేయాల్సి ఉంటుందన్నారు. 7వ సెమిస్టర్‌లో గ్రూపు సబ్జెక్టులు ఉంటాయని, 8వ సెమిస్టర్‌లో విద్యార్థి ఎంచుకున్న ఒకే ప్రత్యేక సబ్జెక్టు ఉంటుందని వివరించారు. నూతన విద్యా విధానం నేపథ్యంలో ఈ ఏడాది డిగ్రీ పూర్తిచేస్తున్న విద్యార్థులతో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలతో పాటు మరికొన్ని కళాశాలల్లో మొదటి బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో 92 కళాశాలలు కోర్సు నిర్వహణకు ఆసక్తి చూపిస్తున్నాయని, అర్హత బట్టి ఎంపికచేస్తామన్నారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో చోరీ

● రూ. 80 వేలు నగదు అపహరణ

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు జంక్షన్ వద్ద శ్రీనివాస రైస్‌మిల్లులో శుక్రవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ఇద్దరు వ్యక్తులు కార్యాలయ గది తాళాలు పగలగొట్టి లాకర్లు తీసి రూ.80 వేలు నగదు తీసుకెళ్లారు. నైట్ వాచ్‌మేన్, మిల్లు డ్రైవర్ కుటుంబం కూడా అదే ఆవరణలో ఉన్నా, వారికి తెలియకుండానే దొంగలు జాగ్రత్తపడ్డారు. పక్కనే ఉన్న శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని శ్రీసీతారామ మిల్లులోకి వెళ్లి కార్యాలయ తలుపులు బద్దలు కొట్టినా అక్కడ ఏమీ లభ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. అక్కడికి కొంతదూరంలో పెట్రోల్‌బంక్ వెనుక ఉన్న చల్ల వారి మిల్లు వద్దకు వెళ్లేసరికి నైట్‌వాచ్‌మేన్ పెద్దగా కేకలు వెయ్యడంతో దొంగలు పారిపోయినట్లు తెలుస్తోంది. క్లూస్‌టీం, శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ మధుసూదనరావులు మిల్లులను పరిశీలించారు. పెట్రోల్‌బంక్, వప్పంగి, శిమ్మపేట జంక్షన్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. మిల్లు యజమాని రెడ్డి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని వస్తపురి కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సీఎస్‌డీటీ ఆధ్వర్యంలో అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు వారణాశి వెంకటరాజు అక్రమంగా నిల్వ చేసిన 300 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు 6–ఏ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా బియ్యం నిల్వ ఉంచినా తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం



క్రికెట్ కిట్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం క్రైమ్: ఆటల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తిని చాటుకోవడమే ప్రధానమనే విషయాన్ని క్రీడాకారులు మరిచిపోవద్దని ఎస్పీ జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆమె ప్రారంభించారు. ముందుగా జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్లు సయ్యద్ ఇషాక్ మహ్మద్, వీఎస్ పంతులు, సి.వి.రాజారెడ్డి, మీర్ మహ్మద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించే దిశగా జిల్లా కేంద్రంతోపాటు సబ్‌సెంటర్లలో సైతం కోచింగ్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉన్నతంగా రాణించి ఐపీఎల్‌తో పాటు ఇండియా జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ మాట్లాడుతూ వర్షాల కారణంగా ఐదు రోజులు జాప్యం జరిగిందని, సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపులు 25 రోజుల పాటు జరుగుతాయన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయి ఎంపికలకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అనంతరం సీఐ ఇలియాస్ మహ్మద్ స్పాన్సర్‌షిప్‌తో దాదాపు రూ.50వేలు విలువైన క్రికెట్ కిట్లను ఎస్పీ చేతులమీదుగా సబ్‌సెంటర్ల క్రీడాకారులు, కోచ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్పీ రెడ్డి, కె.ఎస్ మదీనాశైలానీ, బెనర్జీ, దివాకర్, జోన్ చీఫ్ సెలక్టర్ ఎంఎస్ దీపక్‌కుమార్, సీనియర్ క్రికెటర్ భద్రగిరి మురళీ, స్థానిక కళాశాల పీడీ డాక్టర్ ఎ.మోహన్‌రాజు, కొయ్యాన మధు, కోచ్‌లు కె.సుదర్శన్ (శ్రీకాకుళం), అన్నెపు ఆనంద్, ఎం.రాజాబాబు (కళింగపట్నం), కె.శ్రీనివాస్ (టెక్కలి), అనీల్ (నరసన్నపేట), గోపి (ఇచ్ఛాపురం), మహిళా కోచ్‌లు రమణమ్మ, దమయంతి, ఫిట్‌నెస్ కోచ్ పి.రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

టెక్కలి: గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా కిశోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ టెక్కలి సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. మండలంలోని నందిగాం, టెక్కలి–5 అంగన్‌వాడీ కేంద్రాల్లో సఖీ అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నందిగాంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, కిశోర బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. నిర్ణీత వయసువచ్చే వరకు వివాహాలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలందరిపైనా పైడితల్లి దీవెనలు

● అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శంబంగి



హోమగుండం వద్ద పూజలు చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

టెక్కలి: పైడితల్లి అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపైనా ఉండాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆకాంక్షించారు. మండలంలోని కొల్లివలసలో నూతనంగా నిర్మించిన పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు హోమంలో పాల్గొన్నారు. ఆయన వెంట గ్రామపెద్దలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులున్నారు.

జూన్ 15 నాటికి ఉద్దానం ప్రాజెక్టు సిద్ధం

● పనుల్లో జాప్యం జరిగితే ఇంజినీర్లదే బాధ్యత

● అధికారుల సమీక్షలో మంత్రి సీదిరి అప్పలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో దాదాపు రూ.700కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ప్రాజెక్టు ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే నెల 15 నాటికి సిద్ధం కావాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇంజినీర్లను ఆదేశించారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగితే పూర్తి బాధ్యత ఇంజనీర్లదేనని, తప్పించుకునే ధోరణి ఉండరాదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే ముఖ్యమంత్రి ప్రారంభించేందుకు జిల్లాకు వస్తారని వివరించారు. ఈ విషయాన్ని భావనపాడు, భోగాపురం పర్యటనల్లో సీఎం స్వయంగా ప్రకటించినట్లు మంత్రి గుర్తుచేశారు.

శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్దానం ప్రాజెక్ట్ పనుల పురోగతిపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రాధాన్యతను ఇంజినీరింగ్ అధికారులు గుర్తెరిగి సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉద్దానంలో ఒక ప్రాంతం కాకుండా ఉద్దానం అంతటా నీరు అందాల్సిందేనని స్పష్టం చేశారు. పైపులైన్లు, పంపు సెట్లు, విద్యుత్ భూసమస్యలు, ఇతర సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పనులు వేగవంతం చేయాలన్నారు. జూన్ 5 నాటికి పూర్తయిన పనుల ప్రగతి నివేదికలు తనకు వివరించాలని సూచించారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ ఉప కార్యనిర్వాహక, కార్యనిర్వాహక ఇంజినీర్లకు అప్పగించిన పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల వివరాలను తమకు సమర్పించాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తుల భూముల్లో పైపులైన్లు వేయాల్సి వస్తే న్యాయపరమైన చెల్లింపులు చేస్తామని, పనులకు ఆటంకం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ టి.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును చూసి ప్రజలు నవ్వుతున్నారు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న వెంటనే రైతాంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వ్యవసాయ రంగంలో విప్లవత్మక మార్పులు తీసుకువచ్చారని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కలెక్టరేట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఇటీవల రైతాంగ సమస్యలపై చేసిన వ్యాఖ్యలకు మంత్రి స్పందించారు. గత ప్రభుత్వంలో రైతులు దగా పడ్డారని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు లేక రైతాంగం ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. వర్షం వల్ల తడిచిన ధాన్యం, మొలకెత్తిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసే ప్రక్రియ ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బంది లేకుండా సివిల్ సప్లయ్ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడి కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పౌర సరఫరాల మంత్రి కూడా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు నిత్యం వార్తల్లో ఉండాలనే కోరిక తప్ప చేసిందేమీ లేదన్నారు. నాడు వ్యవసాయం దండగని అవమానించిన తీరును మంత్రి గుర్తు చేశారు. అలాంటి చంద్రబాబు రైతుల కోసం మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. నేటి ప్రభుత్వం విత్తనం నుంచి విక్రయం వరకు అన్ని దశలో రైతుకు అండగా నిలుస్తోందన్నారు.

అరసవల్లి దర్శనాలకు

వైశాఖ ప్రత్యేక మార్గాలు



సంప్రదాయ పూజలకు సిద్ధం చేసిన పుష్కరిణి మెట్లు ప్రాంతం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి వైశాఖ మాసం మూడో ఆదివారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశమున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. గత ఆదివారం జరిగిన పలు లోపాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా వివిధ దర్శనాల మార్గాల వద్ద విధులు నిర్వర్తించేలా, ఎప్పటికప్పుడు పరిస్థితుల పర్యవేక్షించేలా ఆదేశించినట్లు వివరించారు.

- ఎప్పటిలాగానే పర్వదినాలు, ఆదివారాల్లో ఈశాన్య ద్వారం నుంచే భక్తులకు ప్రవేశానికి అనుమతిస్తారు. వీఐపీలకు మాత్రమే సింహ ద్వారం నుంచి అనుమతిస్తారు.
- అసిరితల్లి అమ్మవారి ఆలయం పక్కనుంచి ఈశాన్య గేటు ద్వారా రూ.100, రూ.500 దర్శనాలతో పాటు ఉచిత దర్శనాలకు, కేశఖండన శాల మొక్కులు చెల్లించుకునేందుకు అవకాశం కల్పించారు.
- గత ఆదివారం ఉచిత దర్శనాలకు వెళ్లే మార్గంలో సంప్రదాయ పూజలు చేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడిన నేపథ్యంలో ఈసారి ఇంద్ర పుష్కరిణి మెట్లపై పూజలు, ప్రసాదాల నివేదనలకు మహిళలకు ప్రత్యేకంగా అవకాశం కల్పించారు.
- ఈసారి రూ.500 విశిష్ట దర్శనాన్ని ఆలయానికి ఎదురుగా ఉన్న సమాచార కేంద్రానికి వెనుక భాగం నుంచి ప్రవేశ అనుమతి కల్పించారు.
- ప్రత్యేక దర్శనం (రూ.100) క్యూలైన్‌ను ఇంద్ర పుష్కరిణి రోడ్డు నుంచే ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు చేశారు.
- ప్రతి క్యూలైన్ వద్ద మంచినీటి ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా, ఎండ నుంచి తట్టుకునేలా టెంట్లు ఏర్పాటు చేశారు.
- నిత్యాన్నదాన ప్రసాదం కోసం వెళ్లే భక్తులు దర్శనం చేసుకున్న తర్వాత పుష్కరిణి వద్ద ఉన్న రావిచెట్టు పక్కనుంచి పాత టీటీడీ సత్రంలో నుంచి వెళ్లేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


లబ్ధిదారుకు వాహనాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ఫిష్ ఆంధ్రా పథకంలో భాగంగా లైవ్ ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని వావిలపల్లి జనార్దనరావుకు శనివారం అందజేశారు. సుమారు రూ.20 లక్షల విలువగల వాహనాన్ని 40 శాతం సబ్సీడీపై ప్రభుత్వం అందజేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, డి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆపన్న హస్తం


ట్యూషన్ మాస్టారి కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న తహసీల్దార్, పూర్వ విద్యార్థులు

కురుపాం: మండల కేంద్రంలోని శివ్వన్నపేటకు చెందిన ట్యూషన్ మాస్టారు పెదపెంకి వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులకు పూర్వవిద్యార్థులు పలువురు రూ.43వేల నగదును కురుపాం తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, హరి, అద్దంకి భారతి, పూర్వ విద్యార్థులు సింహాచలం, డి.గణేష్ పాల్గొన్నారు.

పలువురు డీఎస్పీలకు బదిలీలు

విజయనగరం క్రైమ్: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీచేస్తూ రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం సబ్ డివిజన్ డీఎస్పీగా కోస్టల్ సెక్యూరిటీ నార్త్ డీఎస్పీ ఆర్.గోవిందరావు రానున్నారు. ప్రస్తుతం ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.కాళిదాస్ కోస్టల్ సెక్యూరిటీ నార్త్‌కు బదిలీ అయ్యారు. ఇప్పటివరకూ వెయిటింగ్‌లో ఉన్న పి.శ్రీధర్ బొబ్బిలి డీఎస్పీగా బదిలీఅయ్యారు. బొబ్బిలి డీఎస్పీగా పనిచేస్తున్న వి.గిరిధర్ తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న డి.విశ్వనాథ్ విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

10న రామతీర్థం హుండీల ఆదాయం లెక్కింపు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని ఈ నెల 10న లెక్కించనున్నట్టు దేవస్థానం ఈఓ కిశోర్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉదయం 9 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందని, జిల్లాకు చెందిన శ్రీవారి సేవా భక్తులు హుండీల ఆదాయాన్ని లెక్కిస్తారని పేర్కొన్నారు.

18 నుంచి దేవస్థాన భూముల కౌలువేలం

రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 18 నుంచి బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఈఓ కిశోర్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18న సీతారామునిపేటలో, 23న తంగుడుబిల్లి, 26న దన్నానపేట, 31న రామతీర్థంలో ఉన్న దేవస్థాన భూములను బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇస్తామని పేర్కొన్నారు. దేవస్థాన అధికారులు, ట్రస్టు బోర్డు సభ్యులు, ఆయా గ్రామాల పెద్దల ఆధ్వర్యంలో మూడేళ్ల కాలపరిమితికి వేలం జరుగుతుందన్నారు.

రేపు పలు రైళ్ల రద్దు

పార్వతీపురంటౌన్: రైల్వే ట్రాక్ పనుల్లో భాగంగా ఈ నెల 8న పలు రైళ్లు రద్దుచేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారని పార్వతీపురం రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, కొరాపుట్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్(18512), కొరాపుట్-విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (18513), దుర్గ్ విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్(18529) సర్వీసులు 8వ తేదీన ఉండవన్నారు. ఈ నెల 9న విశాఖపట్నం రాయపూర్ పాసింజర్(085127), రాయపూర్ విశాఖపట్నం పాసింజర్ (08546), కొరాపుట్-విశాఖటప్నం పాసింజర్ (08545) రైళ్లను రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

100కి ఫిర్యాదు

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆర్బీకే భవనంలో శుక్రవారం సాయంత్రం కొంతమంది స్థానికులు జూదం ఆడుతూ, మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు 100కు ఫిర్యాదు వచ్చిందని ఎస్ఐ సిద్దార్థ శనివారం తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా అక్కడ జూదరులు ఎవ్వరూ లేకపోవడంతో వెనుదిరిగామన్నారు.

భవితకు బంగారు సోపానాలు...
ఆదర్శ పాఠశాలలు


ఎల్.కోట ఆదర్శ పాఠశాల ముఖ చిత్రం

- ఆదర్శపాఠశాలో 6వ తరగతి ప్రవేశాలు
- మే 9 నుంచి 25వ వరకు దరఖాస్తులు స్వీకరణ
- జూన్ 11న ప్రవేశ పరీక్ష
- ఒకొక్క పాఠశాలలో వంద సీట్లకు పెంపు

భేష్

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. నూతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, మెరుగైన సౌకర్యాలు ఉండడంతో ఈ పాఠశాలలకు ఆదరణ పెరిగింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– పి.శివప్రసాద్, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్, కొత్తవలస

కొత్తవలస: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులకు ఆంగ్ల భాషలో విద్యను ఉచితంగా అందించేందుకు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అప్పట్లో సంకల్పించారు. దీంతో 2013వ సంవత్సరంలో ఆదర్శ పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించింది. దీంతో ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా 16 పాఠశాలలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రతీ సంవత్సరం 1600 మంది విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఏటా ఆరవ తరగతిలో ఒక్కో పాఠశాలలోను 80 మంది విద్యార్థులకు ప్రవేశాలను కల్పించేవారు. ప్రస్తుతం వంద సీట్లకు పెంచినట్లు అధికారులు వెల్లడించారు. ప్రవేశ పరీక్షలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలను కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆరవ తరగతిలో ప్రవేశం పొందిన వారు ఇంటర్మీడియెట్ వరకు ఎటువంటి ఫీజులు లేకుండా ఉచితంగా ఆంగ్ల మీడియంలో విద్యనభ్యసించవచ్చు.

విద్యార్హతలు

ఈ పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదివిన వారై ఉండాలి. ఓసీ, బీసీలకు చెందిన వారు సెప్టెంబరు 1, 2011 నుంచి ఆగస్టు 31, 2013 మధ్య జన్మించి ఉండాలి. అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే సెప్టెంబరు 1, 2009 నుంచి ఆగస్టు 31, 2013 మధ్య జన్మించి ఉండాలి.

దరఖాస్తు చేసే విధానం

విద్యార్థులు ఏపీ ఆన్‌లైన్ లేదా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు ఆధార్, కుల, ఆదాయ, రేషన్ కార్డు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్హతల సర్టిఫికెట్లు ఆయా మండల కేంద్రాల్లోని ఆదర్శ పాఠశాలల్లో అందజేయాలి.

రిజర్వేషన్లు ఇలా...

ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 29 శాతం(బీసీ ఏ 7శాతం, బీసీ బీ 10 శాతం, బీసీ సీలకు 1 శాతం, బీసీ డీకు 7 శాతం, బీసీ ఈలకు 4 శాతం) కేటాయించారు. దివ్యాంగులకు 3 శాతం, బాలికలకు 33.33 శాతం సీట్లను కేటాయించారు. నిర్దేశించిన విభాగాల్లో అభ్యర్థులు లేకపోతే ఇతర గ్రూపుల నుంచి భర్తీ చేస్తారు. 50 శాతం సీట్లు ఇతర కులాలకు కేటాయించారు.

చదువులు కొనసాగాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్


పాల్గొన్న ఎంఈఓలు, హెచ్ఎంలు

విజయనగరం అర్బన్: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా శతశాతం ఆ తరువాత చదువులు కొనసాగించేలా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ కోరారు. పది తరువాత ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ లేదా ఇతర సమానమైన కోర్సుల్లో చేరేలా చూసి వారు చేరిన కోర్సు, అడ్మిషన్ నెంబర్‌తో సహా వివరాలను పంపించాలని ఎంఈఓలను ఆదేశించారు. ముఖ్యంగా బాలికలపై మరింత దృష్టి పెట్టి, వారు చదువును కొనసాగించేలా కృషి చేయాలని సూచించారు. నాడు – నేడు రెండో దశ పనుల ప్రగతిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన తరగతి గదుల నిర్మాణం, వాటి స్థితిగతులు, మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. సిమెంటు, ఇసుక, మెటల్ ఇతర నిర్మాణ సామగ్రి సరఫరా గురించి తెలుసుకున్నారు. ఇప్పటికే సిమెంటు సరఫరా మొదలయిందన్నారు. ఇతర సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికోసం కచ్చితమైన ప్రణాళికతో రోజువారీ లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎంఈఓలు ఇతర అధికారులంతా ప్రతీరోజూ ఒక స్కూల్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నాడు – నేడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అందువల్ల ప్రతీ ఒక్కరూ క్షేత్ర స్థాయిలో ఈ కార్యక్రమంలో పూర్తిగా నిమగ్నం కావాలని సూచించారు. విద్యుద్దీకరణ, ప్లంబింగ్, శానిటరీ పరికరాలను అమర్చడం తదితర అన్ని రకాల పనులనూ పూర్తి చేయాలని అప్పుడే భవనం పూర్తి అయినట్లని స్పష్టం చేశారు. పనులు చేయడానికి మరో 25 రోజులు మాత్రమే గడువు ఉందని ఈ లోగా పూర్తి చేసి పాఠశాలల పునఃప్రవేశం నాటికి భవనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పదో తరగతిలో జిల్లా ఫలితాలను కలెక్టర్‌కు డీఈఓ లింగేశ్వరరెడ్డి వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ డ్రాపౌట్స్ లేకుండా పది ఉత్తీర్ణలైన ప్రతీఒక్కరూ ఆ తరువాత చదువులు కొనసాగించేలా చూడాలన్నారు. శతశాతం చేరికలు జరగాలని స్పష్టం చేశారు. ఎంఈఓలు, విద్యాశాఖ సిబ్బందితో పాటు, సచివాలయ సిబ్బందిని కూడా దీనిలో భాగస్వాములను చేయాలని ఏ ఒక్కరూ చదువు మధ్యలో మానేయకుండా చూడాలని సూచించారు. త్వరలో జగనన్న విద్యాకానుక కిట్లు జిల్లాకు రానున్నాయని వాటిని జాగ్రత్తగా భద్రపరిచి పాఠశాలలు తెరిచే రోజు పంపిణీకి సిద్ధం చేయాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో డీఈఓ లింగేశ్వరరెడ్డి, సమగ్ర శిక్ష ఈఈ ఎంజీఆర్ నాయుడు, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ కె.భాస్కరరావు, ఎంఈఓలు, హెచ్ఎంలు, వివిధ శాఖల డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు ఏపీ మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్.ఏపీఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 9 నుంచి ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75లు, బీసీ, ఓసీ విద్యార్థులు పరీక్ష ఫీజుగా రూ.150లు చెల్లించాలన్నారు. దరఖాస్తు దారులకు జూన్ 11న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం డీఈఓ కార్యాలయం, కురుపాం, భామిని, మక్కువ, సాలూరు మోడల్‌స్కూల్స్ ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు.

12లోగా ఈకేవైసీ పూర్తిచేయాలి

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షనర్లందరూ ఈకేవైసీ నమోదును ఈ నెల 12వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని జిల్లా ఖజానా మరియు లెక్కల అధికారి ఆర్ఎస్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. దీనికోసం ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ఉప ఖజానా కార్యాలయాల్లో ఈకేవైసీ నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పెన్షనర్లందరూ సీఎఫ్ఎంఎస్ ఐడీ నంబర్, ఆధార్ కార్డు, పెన్షను బ్యాంకు ఖాతా పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ ఫోన్ నంబర్ తీసుకుని ఉప ఖజానా కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. సందేహాలుంటే హెల్ప్ డెస్క్ ఫోన్‌నంబర్ 73374 35578, 80195 26534లను సంప్రదించాలన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

లక్కవరపుకోట :మండలంలోని అరకు – విశాఖ రోడ్డులో జమ్మాదేవిపేట ఎత్తు బ్రిడ్జి సమీపంలో శనివారం ఆగి వున్న లారీని గనివాడ గ్రామానికి చెందిన కొట్యాడ తరుణ్ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ ముకుందరావు తెలిపిన వివరాలు... గత మూడు రోజులుగా మరమ్మతులకు గురైన లారీ అరకు – విశాఖ రోడ్డులో నిలిచిపోయింది. ఈ క్రమంలోగనివాడ గ్రామానికి చెందిన కొట్యాడ తరుణ్ తన ద్విచక్ర వాహనంపై ఎల్.కోట వెళ్లి తిరిగి తన స్వగ్రామం వస్తుండగా చీకటిలో రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని గుర్తించక వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో తరుణ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు


చోరీ సొత్తుతో పట్టుబడిన నిందితుడితో ఎస్ఐ జయంతి, సిబ్బంది

బాడంగి: బాడంగి గ్రామంలోని రామమందిరం వెనుక నివాసం ఉంటున్న బొమ్మి వెంకటరమణ ఇంట్లో జరిగిన చోరీ కేసులో బొబ్బిలి మండలానికి చెందిన గొల్లపల్లి ప్రసాద్‌ను శనివారం అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం బొబ్బిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించినట్టు తెలిపారు. ఎవ్వరూ లేని సమయంలో గురువారం రాత్రి ఇత్తడి సామాన్లు దొంగతనానికి పాల్పడినట్టు చెప్పారు.

పట్టుబడిన గంజాయి

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో అరుకు – విశాఖ రహదారిలో మరోమారు గంజాయి పట్టుబడింది. శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్.కోట ఎస్.ఐ లోవరాజుకు బొడ్డవర చెక్ పోస్టు వద్ద పల్సర్‌బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారు. వీరి నుంచి 12కిలోల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. గంజాయితో పట్టుబడ్డ వ్యక్తులను చింతపల్లి మండలం కొత్తబంద గ్రామానికి చెందిన గొల్లూరి గోవింద, కేరళ రాష్ట్రం తివేండ్రంకి చెందిన అల్ అజీజ్‌గా గుర్తించినట్టు చెప్పారు. ఉప తహసీల్దార్ పి.హరి, వీఆర్వో వెంకటరమణల సమక్షంలో వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్టు చెప్పారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు సాలూరుకు చెందిన ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడినట్టు తెలిసింది. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసుల విచారణలో యాసర్ల దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అయితే తనిఖీల్లో అదుపులోకి తీసుకున్న మిగిలిన యువకుల పాత్ర లేదని, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు సీఐ ఎం.నాగేశ్వరరావు విలేకర్లకు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న అశోక్

పార్వతీపురం: భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న వివాదంలో మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకొంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... జియ్యమ్మవలస మండలం బట్లబద్ర గ్రామానికి చెందిన అల్లు అశోక్, ఆయన భార్య మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకొంది. వివాదం అనంతరం భార్య కొత్తవలసలో ఉన్న అక్క ఇంటికి వెళ్లింది. తరువాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న అశోక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పీఓ విచారణ


కంబరవలస జిల్లా పరిషత్ హైస్కూల్ వంట ఏజెన్సీలతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

వీరఘట్టం: మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నైట్ వాచ్‌మెన్ పోస్టుకు సంబంధించి గ్రామంలో వివాదం చోటు చేసుకోవడంతో సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులను సమన్వయం చేసి శనివారం విచారణ చేపట్టారు. ఇరువర్గాల నుంచి స్పష్టత లేకపోవడంతో డిప్యూటీ విద్యా శాఖాధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ ఈ నెల 8వ తేదీన గ్రామానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. తదుపరి నైట్ వాచ్‌మెన్ పోస్టును నియమించేందుకు చర్యలు తీసుకుంటామని పీఓ స్పష్టం చేశారు. విచారణ అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా దళితులు తాగునీటి సమస్యతో పాటు, గృహ నిర్మాణ బిల్లులు, విద్యుత్ స్తంభాలు వంటి సమస్యలను పీఓ దృష్టికి తీసుకువచ్చారు. గతేడాది టైలరింగ్ సంబంధించిన పథకం వర్తించిందని, ఈ ఏడాది ఆ పథకం రాలేదని, భూసార లక్ష్యం పీఓ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ వై.వెంకట్రావును ఆదేశించారు. దళితుల నుంచి సమస్యలు విన్న పీఓ ఈ నెల 8వ తేదీన స్వయంగా గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి ఏ సమస్యలున్నాయో వాటిని పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు.

బాధితురాలికి బంగారు ఆభరణాల అప్పగింత


బాధితురాలికి బ్యాగ్‌ను అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: పోగొట్టుకున్న బంగారు వస్తువులను తిరిగి బాధితురాలికి అప్పగించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ద్వారపూడి గ్రామానికి చెందిన వి.వరలక్ష్మి రణస్థలం వెళ్లేందుకు ద్వార పూడిలో ఆటో ఎక్కి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో దిగింది. బ్యాగ్ ఆటోలో మర్చిపోయి హడావుడిగా కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కేందుకు వెళ్లి, బ్యాగ్ ఆటోలో మర్చిపోయినట్లు గుర్తించింది. వెనక్కి రాగా, అప్పటికే ఆటో అక్కడ నుంచి వెళ్లిపోవడంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించి ఆటోను గుర్తించారు. బ్యాగ్‌లో సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి, బ్యాగ్‌ను ఆమెకు సీఐ సమక్షంలో అప్పగించారు. సకాలంలో స్పందించి తక్షణ చర్యలు చేపట్టిన వన్‌టౌన్ ఎస్ఐ అశోక్‌ను సీఐ అభినందించారు. పోలీసులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

రోగి ప్రాణాలు కాపాడిన సర్వజన ఆస్పత్రి వైద్యులు


కోలుకున్న రోగి సన్నితో వైద్యులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల ఒకటో తేదిన కలెక్టరేట్ ఆవరణలో గొంతు కోసుకున్న వ్యక్తిని పోలీసులు సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చేర్పించిన సమయానికి రోగి శ్వాస నాళం తెగిపోయి కోమాలోకి వెళ్లిపోయాడు. దీంతో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు డాక్టర్ చైతన్య బాబు, ఈఎన్‌టీ వైద్యులు రమేష్ అతనికి శస్త్రచికిత్స ప్రాణాలు నిలిపారు. గొంతు కోసుకోవడం వల్ల అతనికి తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో అతని హెచ్‌బీ 5 గ్రాములకు పడిపోయింది. దీంతో అతనికి రెండు యూనిట్లు రక్తం ఎక్కించారు. ప్రస్తుతం అతను పూర్తిగా కోలుకున్నారు. రోగి ఆస్పత్రిలో చేరినప్పుడు అతని వివరాలు ఏమి తెలియడం లేదు. అతను కోలుకున్న తర్వాత తన పేరు సన్ని అని తెలిపాడు. ఒకటి రెండు రోజుల్లో అతన్ని డిశ్చార్జ్ చేయనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బొత్స సంతోష్ తెలిపారు.

ఇంపెక్స్ పరిశ్రమ మూత


ఇంపెక్స్ పరిశ్రమ

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఇంపెక్స్ పరిశ్రమ మూత పడింది. సుమారు 200 మంది కార్మికులు ఉన్న ఈ కంపెనీ వివిధ సమస్యలతో మూత పడినట్టు యాజమాన్య ప్రతినిధి మురళి శనివారం తెలిపారు. కార్మికులకు ఏ విధమైన పరిస్థితుల్లో మూసివేస్తున్నదీ తెలియజేసినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, యూనియన్ అధ్యక్షుడు ఎస్.గోపాలం అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య

వంగర: మండల పరిధి మరువాడ గ్రామానికి చెందిన బమ్మిడి సూర్యుడమ్మ (32) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఆర్.జనార్ధనరావు శనివారం తెలిపారు. భర్త సింహాచలం మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని, భర్తను బెదిరించే క్రమంలో ఈ నెల 4న గడ్డి మందు సేవించింది. మోతాదు ఎక్కువ కావడంతో పరిస్థితి విషమించింది. రాజాం ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం సూర్యుడమ్మ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త సింహాచలంతో పాటు ఇద్దరు ఆడ పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పద్మావతికి నటగాన మంజరి బిరుదు


కె.వి.పద్మావతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ పౌరాణిక నాటక కళాకారిణి కె.వి.పద్మావతికి శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నటగాన మంజరి బిరుదును ప్రదానం చేశారు. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరంలో శనివారం శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో 283వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య ఆర్థిక సలహాదారు బి.ఎ.మోహనరావు, స్నేహితుల సౌజన్యంతో అరకిలో వెండితో తయారు చేసిన రజిత మకుటాన్ని పద్మావతికి బహూకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి మాట్లాడుతూ పౌరాణిక కళాకారిణిగా రాణించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం, కురుక్షత్రం(పాండవసీను), గయోపాఖ్యానం(యుద్ధసీను), సత్యహరిశ్చంద్ర(వారణాసి సీను నుంచి) ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు రామలింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, రామచంద్రదేవ్, చిట్టి వెంకటరావు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

• స'లక్ష'ణ అర్చన



శ్రీకాకుళంలోని నానుబాలవీధిలోగల శ్రీవిజయదుర్గ అమ్మవారికి ఆ ఆలయ అర్చకులు లక్ష జాజులతో శనివారం అర్చన చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.
–శ్రీకాకుళం అర్బన్